


జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| మంగళవారం 05 మే 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 337 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|

# ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు: రాజకీయ ముఖచిత్రం మార్చిన తీర్పు

## రాష్ట్రాల వారీగా ఫలితాలు, ముఖ్యమంత్రి పదవులపై ఉత్కంఠ

| రాజకీయం

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, మే 05, ప్రతినిధి: దేశవ్యాప్తంగా ఆసక్తిగా ఎదురుచూసిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాజకీయంగా పెద్ద మార్పులకు దారితీశాయి. రాష్ట్రాల వారీగా ఫలితాలు, ముఖ్యమంత్రి అవకాశాలపై చర్చలు ఊపందుకున్నాయి.

అసోం రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించి స్పష్టమైన మెజారిటీని పొందింది. మొత్తం 126 స్థానాల్లో 82 స్థానాలు గెలుచుకున్న బీజేపీ మరోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో అదే పార్టీ నుంచి ప్రస్తుత నాయకత్వం కొనసాగుతూ ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

కేరళలో భారత జాతీయ కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా అవతరించింది. 140 స్థానాల్లో 63 స్థానాలు గెలుచుకున్న కాంగ్రెస్, కూటమి మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో కాంగ్రెస్ నుంచే ముఖ్యమంత్రి ఎంపిక అవుతారని అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

పుదుచ్చేరిలో అఖిల భారత ఎన్ఆర్ కాంగ్రెస్ ఆధిక్యం సాధించి అధికారానికి చేరువైంది. 12 స్థానాల్లో విజయం సాధించిన ఈ పార్టీ ఎన్డీఏ మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశముండగా, అదే పార్టీ నుంచి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఉన్నాయి.

తమిళనాడులో తమిళగ వెట్రి కళగం సంచలన విజయం సాధించి 106 స్థానాల్లో గెలుపొందింది. ఈ విజయంతో ఆ పార్టీ రాజకీయాల్లో కీలక శక్తిగా ఎదిగింది. పార్టీ స్థాపక నాయకత్వం నుంచే ముఖ్యమంత్రి అభ్యర్థి ఉండే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

పశ్చిమ బెంగాల్‌లో భారతీయ జనతా పార్టీ భారీ మెజారిటీ సాధించి 206 స్థానాల్లో విజయం సాధించింది. ఈ ఫలితంతో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయంగా కనిపిస్తోంది. రాష్ట్రంలో కొత్త నాయకత్వం ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

మొత్తంగా ఈ ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీస్తూ, అనేక రాష్ట్రాల్లో కొత్త నాయకత్వానికి మార్గం సుగమం చేశాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.




### మూడు రాష్ట్రాల్లో మార్పు తీర్పు – తమిళనాడులో టీవీకే సంచలనం

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, మే 05, ప్రతినిధి: నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మూడు ప్రధాన రాష్ట్రాల్లో ఓటర్లు మార్పు కోరుకున్నట్లు ట్రెండ్స్ స్పష్టం చేస్తున్నాయి. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో అధికార పక్షాలకు గట్టి షాక్ తగిలి కొత్త రాజకీయ సమీకరణాలకు మార్గం సుగమమైంది.

పశ్చిమ బెంగాల్‌లో భారతీయ జనతా పార్టీ భారీ ఆధిక్యంలో కొనసాగుతూ అధికారానికి చేరువవుతోంది. మ్యాజిక్ ఫిగర్ 148 కాగా, బీజేపీ 170 స్థానాల్లో ఆధిక్యంలో ఉండగా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ 116 స్థానాలకు పరిమితమైంది. దీంతో రాష్ట్రంలో అధికార మార్పు ఖాయమనే సంకేతాలు కనిపిస్తున్నాయి.

తమిళనాడులో రాజకీయాలు పూర్తిగా మారిపోయాయి. 234 స్థానాలున్న అసెంబ్లీలో మ్యాజిక్ ఫిగర్ 118 కాగా, తమిళగ వెట్రి కళగం పార్టీ 106 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతూ సంచలనం సృష్టిస్తోంది. అధికార ద్రావిడ మున్నేట్ర కళగం-కాంగ్రెస్ కూటమి కేవలం 56 స్థానాల్లో మాత్రమే ఆధిక్యంలో ఉండగా, అన్నా ద్రవిడ మున్నేట్ర కళగం-బీజేపీ కూటమి 70 స్థానాల్లో ముందంజలో ఉంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ కొళత్తూరు నియోజకవర్గంలో టీవీకే అభ్యర్థి చేతిలో ఓటమి పాలవడం రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద సంచలనంగా మారింది.

కేరళలో కూడా అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ కూటమికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మొత్తం 140 స్థానాల్లో మ్యాజిక్ ఫిగర్ 71 కాగా, యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ 96 స్థానాల్లో ఆధిక్యంలో ఉండి స్పష్టమైన ఆధిక్యం సాధిస్తోంది. ఎల్‌డీఎఫ్ కూటమి 42 స్థానాలకు పరిమితమైంది.

మొత్తం మీద ఈ ఎన్నికలు "రాజకీయాల్లో ఏదైనా సాధ్యమే" అన్న వాక్యాన్ని మరొకసారి నిజం చేశాయి. దశాబ్దాల చరిత్ర కలిగిన ప్రధాన పార్టీలు వెనుకబడగా, కేవలం రెండు సంవత్సరాల క్రితం ప్రారంభమైన టీవీకే పార్టీ అద్భుత ప్రదర్శనతో తమిళనాడులో రాజకీయాలను కుదిపేసింది.




## విద్యుత్ ప్రాజెక్టుల అవినీతి ఆరోపణలు సీబీఐకి కేబినెట్ కీలక నిర్ణయాలు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 05, ప్రతినిధి: గత ప్రభుత్వ కాలంలో జరిగిన విద్యుత్ కొనుగోళ్లు, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్రాజెక్టులలో అవినీతి ఆరోపణలపై జస్టిస్ మదన్ బి. లోకూర్ నేతృత్వంలోని కమిషన్ నివేదికను పరిశీలించిన రాష్ట్ర మంత్రివర్గం, తదుపరి దర్యాప్తు కోసం కేసును సీబీఐకి అప్పగించేందుకు ఆమోదం తెలిపింది. 114 పేజీల నివేదికపై అడ్వకేట్ జనరల్ అభిప్రాయాలను పరిశీలించిన కేబినెట్, ఇందులో అంతర్రాష్ట్ర అంశాలు, కేంద్ర సంస్థల ప్రమేయం ఉన్నందున సమగ్ర, నిష్పాక్షిక విచారణ అవసరమని భావించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకోగా, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో భూముల మార్కెట్ విలువలను సవరించి క్రమబద్ధీకరించేందుకు రిజిస్ట్రేషన్ శాఖకు అనుమతి ఇచ్చి, ఈనెల చివర్లో కొత్త ధరలు అమల్లోకి తేవాలని నిర్ణయించారు. నిర్వాసితుల పరిహారం రేట్లపై అసంతృప్తిని దృష్టిలో ఉంచుకుని శాస్త్రీయంగా ధరలను పెంచేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. హిల్ట్ పాలసీ కింద దరఖాస్తుదారులకు 10 శాతం ముందస్తు చెల్లింపు, మిగతా 90 శాతం 90 రోజుల్లో చెల్లించే వెసులుబాటు కల్పించనుంది. రాష్ట్రంలోని ఐటీఐలు, పాలిటెక్నిక్ కాలేజీలు, టీ-శాట్ సంస్థలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించింది. నల్గొండ–రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సంఘాన్ని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డుకు అప్పగించేందుకు ఎంఓయూ ఆమోదించగా, సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం 33/11 కేవీ సబ్ స్టేషన్ల సమీపంలో పైలెట్ ప్రాజెక్టుగా ప్లాంట్ల ఏర్పాటు చేయనుంది. అలాగే గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి ప్రాంతాల్లో పెండింగ్ పన్నుల క్లియరెన్స్ కోసం వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) అమలు చేయనుండగా, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లో ఆధునిక కూరగాయల మార్కెట్ కోసం 42 ఎకరాల భూమి కేటాయింపుకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.

## ఫార్మా సిటీ బాధితులకు మల్లన్న భరోసా ఉద్యమాన్ని హైదరాబాద్‌కు తరలించాలని పిలుపు



సందేశం టైమ్స్, ఇబ్రహీంపట్నం, మే 05, ప్రతినిధి: ఫార్మా సిటీ ఏర్పాటు కారణంగా భూములు కోల్పోయే ప్రమాదంలో ఉన్న రైతులకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కుర్మిద్ద తండాలో నిరసనలు కొనసాగిస్తున్న బాధితులను పరామర్శించిన ఆయన, "ఒక్క గజం భూమి కూడా పోనివ్వను" అంటూ ధైర్యం చెప్పారు. గత 50 రోజులుగా తీవ్ర ఎండలో నిరసనలు చేపడుతున్న రైతుల సమస్యలను విన్న మల్లన్న, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి రైతులపై ఒత్తిడి తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండించారు. స్థానికంగా టెంట్లు వేసుకుని కూర్చుంటే ప్రభుత్వం పట్టించుకోదని, సమస్యపై రాష్ట్రవ్యాప్తంగా దృష్టి సారించేలా ఉద్యమాన్ని హైదరాబాద్‌కు తరలించాలని సూచించారు. పోరాటానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించేందుకు నాలుగు గ్రామాల ప్రతినిధులు తనను కలవాలని పిలుపునిస్తూ, ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు తమ భూముల వివరాలు ఆన్‌లైన్ రికార్డుల నుంచి తొలగించడంతో పాటు రైతుబంధు నిలిపివేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన మల్లన్న, రాజకీయ నాయకుల్లా మాట తప్పనని, బాధితుల హక్కులను కాపాడేందుకు చివరి వరకు పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

## దేశంలో బీజేపీ ప్రభంజనం... 78% జనాభా మద్దతు అన్న మోదీ వ్యాఖ్యలు చర్చనీయాంశం



సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, మే 05, ప్రతినిధి: దేశ రాజకీయాల్లో కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయని ప్రధానమంత్రి Narendra Modi వ్యాఖ్యానించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. దేశ జనాభాలో దాదాపు 78 శాతం మంది ప్రజలు భారతీయ జనతా పార్టీకి మద్దతుగా ఉన్నారని ఆయన పేర్కొన్నట్టు సమాచారం. పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరిలో పార్టీ ప్రాభవం కొనసాగుతుండటంతో దేశ రాజకీయ పటంలో కాషాయ ప్రభంజనం స్పష్టమైందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తం 29 రాష్ట్రాల్లో సుమారు 20 ప్రాంతాల్లో బీజేపీ ఆధిపత్యం కొనసాగడం పార్టీ శక్తిని తెలియజేస్తోందని చెబుతున్నారు. ఉత్తర భారతదేశం నుంచి దక్షిణాది వరకు, ఈశాన్య రాష్ట్రాల నుంచి తూర్పు ప్రాంతాల వరకు విస్తరించిన బీజేపీ ప్రభావం దేశవ్యాప్తంగా కనిపిస్తోందని పేర్కొంటున్నారు. జమ్మూ కాశ్మీర్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, మిజోరాం, జార్ఖండ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు వంటి కొన్ని రాష్ట్రాలు మినహా మిగతా ప్రాంతాల్లో పార్టీ తన పట్టు పెంచుకున్నట్టు అంచనాలు వ్యక్తమవుతున్నాయి. భూభాగ పరంగా దేశ విస్తీర్ణంలో దాదాపు 72 శాతం ప్రాంతంలో బీజేపీ పాలన కొనసాగుతుండగా, జనాభా పరంగా ఇది 78 శాతానికి చేరుకుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన సమయంలో కేవలం ఎనిమిది రాష్ట్రాల్లో మాత్రమే పార్టీ ప్రభుత్వాలు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య గణనీయంగా పెరగడం గమనార్హంగా మారింది.

# కేంద్ర పథకాల అమలుపై సమీక్ష మరింత పురోగతికి దిశానిర్దేశం




సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 05, ప్రతినిధి: సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై యూనియన్ కార్యదర్శి సుధాంశ్ పంత్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్తో కలిసి సోమవారం సచివాలయంలో రాష్ట్ర ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. పేద, వెనుకబడిన వర్గాల అభివృద్ధికి సంబంధించిన ప్రీ-మెట్రిక్, పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, పౌర హక్కుల రక్షణ, ఎస్సీ/బీసీ హాస్టళ్ల నిర్మాణం, ట్రాన్స్‌జెండర్ పునరావాసం, నేషనల్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్ వంటి కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కేంద్ర కార్యదర్శి సుధాంశ్ పంత్ రాష్ట్రం సాధించిన పురోగతిని ప్రశంసిస్తూ, ఇంకా మెరుగైన ఫలితాల కోసం కృషి కొనసాగించాలని సూచించారు. వెనుకబడిన వర్గాల సామాజిక-ఆర్థికాభివృద్ధి కోసం నిరంతర ప్రయత్నాలు అవసరమని పేర్కొంటూ, రాష్ట్రం ప్రస్తావించిన పెండింగ్ సమస్యలను కేంద్రం పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో మరింత ఆర్థిక సహాయం లభించే అవకాశముందని, దీని ద్వారా లబ్ధిదారులకు విస్తృత ప్రయోజనాలు అందుతాయని తెలిపారు. తెలంగాణ పేరెంటల్ సపోర్ట్ చట్టాన్ని ప్రగతిశీల చర్యగా అభివర్ణిస్తూ సామాజిక రక్షణలో ఇది ముఖ్యమైన ముందడుగు అని చెప్పారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాల ప్రస్తుత స్థితిని సబ్యసాచి ఘోష్ వివరించగా, కేంద్ర మద్దతు అవసరమైన విధాన అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా సహా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# యువ ఇంజనీర్లకు శిక్షణ బాధ్యత పరిశ్రమలదే: మంత్రి శ్రీధర్ బాబు



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 05, ప్రతినిధి: తెలంగాణలో ప్రతి సంవత్సరం చదువులు పూర్తి చేసుకుంటున్న సుమారు రెండు లక్షల ఇంజనీరింగ్ పట్టభద్రులకు శిక్షణనిచ్చి ఉద్యోగాలకు సిద్ధం చేసే బాధ్యతను పరిశ్రమలు స్వీకరించాలని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. యూనివర్సిటీ విద్యకు, పరిశ్రమల అవసరాలకు మధ్య పెరుగుతున్న అంతరాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి సంస్థ తమ బాధ్యతగా శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు. బేగంపేటలోని వివాంతా హోటల్‌లో పిఎస్ ఆర్ టెక్ హబ్ సంస్థ పదేళ్ల ప్రస్థానం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, టెక్నాలజీ రంగంలో సవాళ్లను అధిగమించి రూ.120 కోట్ల స్థాయికి ఎదిగిన సంస్థ అధినేత పి. శ్రీరంగారావును అభినందించారు. కరోనా సమయంలో అనేక సంస్థలు నష్టపోయినా పిఎస్ ఆర్ టెక్ హబ్ 250 మంది ఉద్యోగులకు భరోసా కల్పించడం విశేషమన్నారు. ఏఐ వంటి కొత్త సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనేందుకు ఇంజనీర్ల నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, 'ఏఐ హబ్' పేరుతో ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి త్వరలో రీస్కిల్లింగ్ కార్యక్రమాలు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ పి. నమ్యుత మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సేవలను విస్తరించడంతో పాటు వచ్చే మూడేళ్లలో విదేశాల్లో కూడా కార్యాలయాలు ఏర్పాటు చేసి ఉద్యోగుల సంఖ్యను వెయ్యికి పెంచుతామని చెప్పారు. చదువులు పూర్తి చేసిన ఇంజనీరింగ్ విద్యార్థులకు శిక్షణనిచ్చి ప్రతిభావంతులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు, క్లయింట్లు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# సంక్షేమంలో తెలంగాణకు పూర్తి సహకారం: కేంద్ర కార్యదర్శి సుధాంశ్ పంత్ ప్రశంసలు





సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 05, ప్రతినిధి: కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత శాఖ కార్యదర్శి సుధాంశ్ పంత్ తెలంగాణ పర్యటనలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రశంసిస్తూ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన పర్యటనలో భాగంగా ఆయన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ను కలిసి ఎస్సీ, బీసీ, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, వృద్ధుల సంక్షేమానికి సంబంధించిన పథకాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని ముందుకు సాగుతోందని మంత్రి వివరించగా, రాష్ట్రం చేపట్టిన వినూత్న కార్యక్రమాలకు కేంద్రం అవసరమైన మద్దతు అందిస్తుందని సుధాంశ్ పంత్ తెలిపారు.మసాబ్ ట్యాంక్‌లోని డే కేర్ సెంటర్, ఓల్డ్ ఏజ్ హోమ్, డీ-అడిక్షన్ కేంద్రాలను సందర్శించిన ఆయన అక్కడి సదుపాయాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ట్రాన్స్‌జెండర్ల నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన, దివ్యాంగుల సంక్షేమ పథకాల అమలు, వృద్ధుల సంరక్షణలో తీసుకుంటున్న చర్యలను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రంలో డీ-అడిక్షన్ కేంద్రాల విస్తరణ, యువతను మత్తు పదార్థాల నుంచి దూరం చేయడానికి చేపడుతున్న చర్యలు, మెట్రో స్టేషన్ల భద్రతలో ట్రాన్స్‌జెండర్ల భాగస్వామ్యం వంటి అంశాలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆయన కొనియాడగా, కేంద్రానికి సంబంధించిన పెండింగ్ నిధులను త్వరలో విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ సహా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి అకాల వర్షాలపై అప్రమత్తం: ఉత్తమ్ కుమార్ రెడ్డి



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 05, ప్రతినిధి: రబీ సీజన్‌లో పెరిగిన ధాన్యం ఉత్పత్తిని దృష్టిలో ఉంచుకుని కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుండి నిర్వహించిన అత్యవసర వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాల ఇంచార్జ్ మంత్రులు, కలెక్టర్లు, ఉన్నతాధికారులతో కలిసి సమీక్ష నిర్వహించిన ఆయన, రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 14.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి గాను రైతుల ఖాతాల్లో రూ.2001.96 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. రాబోయే రోజుల్లో భారీగా ధాన్యం కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నందున కొనుగోళ్లను వేగవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లో అధికంగా ధాన్యం రాకపోకలు జరుగుతున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అకాల వర్షాల కారణంగా సూర్యాపేట, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో 299 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిపోయినట్లు సమాచారం వచ్చిందని, తడిసిన ధాన్యాన్ని తక్షణమే రైస్ మిల్లులకు తరలించే చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. రాబోయే 3-4 రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సూచనలను అధికారులు కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్‌ల వినియోగం వంటి చర్యలతో రైతాంగం నష్టపోకుండా చూడాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు.



# ప్రతి సోమవారం డివిజన్ స్థాయిలో ప్రజావాణి ధాన్యం కొనుగోళ్లపై కఠిన పర్యవేక్షణ ఆదేశాలు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 05, ప్రతినిధి: జిల్లాలో ప్రతి సోమవారం డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ప్రజలు తమ డివిజన్ కేంద్రాల్లో జరిగే ప్రజావాణి కార్యక్రమానికి హాజరై సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంగారెడ్డి, ఆందోల్, నారాయణఖేడ్, జహీరాబాద్ డివిజన్లలో ప్రజావాణి నిర్వహణ కొనసాగుతోందని, అధికారులు తప్పనిసరిగా హాజరై ఫిర్యాదులను 30 రోజుల్లో పరిష్కరించాలని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 134 ఫిర్యాదులు అందగా, కలెక్టరేట్‌కు 57, సంగారెడ్డి డివిజన్‌కు 29, ఆందోల్‌కు 2, నారాయణఖేడ్‌కు 24, జహీరాబాద్‌కు 22 ఫిర్యాదులు వచ్చినట్లు వెల్లడించారు. ఇదే సమయంలో అకాల వర్షాల నేపథ్యంలో వరి ధాన్యం కొనుగోళ్లపై నిరంతర పర్యవేక్షణ అవసరమని కలెక్టర్ సూచించారు. కొనుగోలు కేంద్రాలను తరచూ సందర్శించి పరిస్థితులను సమీక్షించాలని, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే వివరాలను ఓపీఎంఎస్‌లో నమోదు చేసి చెల్లింపులు సకాలంలో జమయ్యేలా చూడాలని ఆదేశించారు. తడిసిన ధాన్యం వల్ల రైతులు నష్టపోకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని, శాఖల మధ్య సమన్వయం పెంచి కొనుగోలు ప్రక్రియను ఎటువంటి ఆటంకాలు లేకుండా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

# మొక్కజొన్న, జొన్నలను పీఎస్ఎస్‌లో చేర్చాలి కొనుగోలు పరిమితులు ఎత్తివేయాలి: మంత్రి తుమ్మల

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 05, ప్రతినిధి: రాష్ట్రంలో రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా మొక్కజొన్న, జొన్న పంటలను పీఎస్ఎస్ పథకంలో చేర్చాలని, శనగ, పొద్దుతిరుగుడు పంటలపై అమలులో ఉన్న 25 శాతం కొనుగోలు పరిమితిని ఎత్తివేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్కు లేఖ రాసిన మంత్రి, కేంద్ర పరిమితుల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. శనగ పంటపై 29,860 మెట్రిక్ టన్నులు, పొద్దుతిరుగుడు పంటపై 3,690 మెట్రిక్ టన్నుల వరకు మాత్రమే కేంద్రం కొనుగోలు అనుమతించగా, ఆ పరిమితులు ఇప్పటికే పూర్తయ్యాయని, ఇంకా రైతుల వద్ద పంట నిల్వ ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో శనగ కొనుగోళ్ల పరిమితిని 1,12,077 మెట్రిక్ టన్నులకు, పొద్దుతిరుగుడు కొనుగోళ్లను 10,839 మెట్రిక్ టన్నులకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో విస్తృతంగా సాగు చేసే మొక్కజొన్న 11.21 లక్షల ఎకరాల్లో, జొన్న 3.68 లక్షల ఎకరాల్లో పండించగా, మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లభించక రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 246 కొనుగోలు కేంద్రాల ద్వారా 3.99 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులకు ఉపశమనం కల్పించినట్టు తెలిపారు. గత ఖరీఫ్ సీజన్‌లో 3.76 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేసి రూ.902.80 కోట్ల వ్యయం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో పీఎస్ఎస్ పథకంలో మొక్కజొన్న, జొన్నలను చేర్చి కేంద్ర నోడల్ ఏజెన్సీల ద్వారా 14.89 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న, 2.76 లక్షల మెట్రిక్ టన్నుల జొన్న కొనుగోళ్లకు అనుమతి ఇవ్వాలని మంత్రి కోరారు. దీంతో రైతులకు కనీస మద్దతు ధర హామీ కల్పించడమే కాకుండా తక్కువ ధరలకు అమ్మకాల పరిస్థితిని నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు.

# నిమ్స్‌కు తాగునీటి సరఫరా నిరంతరం కొనసాగుతోంది: జలమండలి స్పష్టీకరణ

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 05, ప్రతినిధి: నిమ్స్ ఆసుపత్రికి తాగునీటి సరఫరా విషయంలో ఎటువంటి అంతరాయం లేదని జలమండలి స్పష్టం చేసింది. బంజారాహిల్స్ జీఎల్ఎస్ఆర్ నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 300 ఎంఎం వ్యాసం గల ఫీడర్ ద్వారా నీటి సరఫరా జరుగుతోందని తెలిపింది. ఆసుపత్రి ప్రాంగణంలో రెండు 100 ఎంఎం బల్క్ కనెక్షన్లు వేర్వేరు సంపులకు అనుసంధానించి, ఏడాది పొడవునా 24 గంటలపాటు నిరంతర సరఫరా కొనసాగుతోందని వెల్లడించింది. జలమండలి తరఫున ఎలాంటి వాల్వ్ ఆపరేషన్లు నిర్వహించడం లేదని, బంజారాహిల్స్ రిజర్వాయర్‌లో నీటి మట్టం తగిన స్థాయిలో ఉందని పేర్కొంది. ఆసుపత్రి ప్రాంగణంలో నీటి వినియోగం, అంతర్గత పంపిణీ వ్యవస్థ నిర్వహణ పూర్తిగా నిమ్స్ అధికారుల ఆధీనంలోనే ఉందని తెలిపింది. మొత్తంగా నిమ్స్‌కు తాగునీటి సరఫరా సాధారణంగా కొనసాగుతోందని, ఎటువంటి అంతరాయం లేదని జలమండలి వెల్లడించింది.



## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం – అకాల వర్షాలపై అప్రమత్తం, ప్రజావాణి ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 05, ప్రతినిధి: జిల్లాలో పిపిసి కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయడంతో పాటు అకాల వర్షాల ప్రభావాన్ని తగ్గించేందుకు యంత్రాంగం అప్రమత్తంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆయన, జిల్లాలో ఇప్పటివరకు 1.39 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, అందులో 1.31 లక్షల మెట్రిక్ టన్నులను మిల్లులకు తరలించినట్లు తెలిపారు. రైతుల ఖాతాల్లో ఇప్పటివరకు సుమారు రూ.100 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రోజుకు 10 వేల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ, ఓఆర్ఎస్ సదుపాయాలు కల్పించడంతో పాటు హమాలి, రవాణా ఏర్పాట్లు సమర్థవంతంగా ఉండేలా చూడాలని సూచించారు. రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున టార్పాలిన్‌లు సిద్ధంగా ఉంచి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఇదే సమయంలో ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని హెచ్చరించారు. ఇటీవల నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 105 దరఖాస్తులు అందగా, వాటిని శాఖల వారీగా పంపించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అనంతరం నల్గొండ రైస్ ఇండస్ట్రీ, వజ్రా రైస్ ఇండస్ట్రీతో పాటు పలు కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి కొనుగోలు, తూకం, రవాణా ప్రక్రియలను సమీక్షించారు. లారీలు మిల్లుల వద్ద ఆలస్యం కాకుండా చూడాలని, నిబంధనలు అతిక్రమించే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు తమ ధాన్యాన్ని నాణ్యతా ప్రమాణాలతో కేంద్రాలకు తీసుకురావాలని సూచిస్తూ, గడువులోగా కొనుగోళ్లు పూర్తి చేసి రైతులకు సకాలంలో చెల్లింపులు జరగడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

## చింతకానిలో అగ్ని ప్రమాదం – 80 ఎకరాల పంట నష్టం, రైతులకు తక్షణ సహాయం చేయాలి: లింగాల కమల్ రాజు



సందేశం టైమ్స్, ఖమ్మం, మే 05, ప్రతినిధి: చింతకాని మండలం పాతర్లపాడు గ్రామంలో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో సుమారు 80 ఎకరాల మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమై, వందల సంఖ్యలో గొర్రెలు సజీవ దహనమైన ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఘటనపై మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు స్పందిస్తూ నష్టపోయిన రైతులను పరామర్శించారు. రైతులు పండించిన పంటను కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొన్నదని, ప్రమాదం జరిగి రెండు రోజులు గడిచినా ప్రభుత్వ స్పందన లేకపోవడం బాధాకరమని విమర్శించారు. వెంటనే ఖమ్మం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరిన ఆయన, తక్షణ పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై నిరసనగా ధర్నా నిర్వహించి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నున్న నాగేశ్వరావు, పొన్నం వెంకటేశ్వరావు, మడుపల్లి గోపాలరావుతో పాటు బీఆర్ఎస్ నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ జీహెచ్ఎంసీ ఉద్యోగి అరెస్ట్ – ఏసీబీ వలలో శ్రీలత




సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 05, ప్రతినిధి: హైదరాబాద్‌లో లంచం తీసుకుంటూ జీహెచ్ఎంసీ ఉద్యోగి ఏసీబీకి చిక్కిన ఘటన వెలుగులోకి వచ్చింది. బోరబండ జీహెచ్ఎంసీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీలత ఇంటి నిర్మాణ అనుమతి ఫైల్ క్లియర్ చేయడానికి రూ.5 లక్షల లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. ఈ మేరకు ఫిర్యాదు అందుకున్న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు పన్నిన ఉచ్చులో భాగంగా రూ.1 లక్ష లంచం స్వీకరిస్తుండగా ఆమెను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఆమెను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

## మేడికుందలో విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం – అధికారులకు రైతుల కృతజ్ఞతలు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 05, ప్రతినిధి: వట్పల్లి మండలం మేడికుంద గ్రామంలో రైతులు సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. వ్యవసాయ బావుల వద్ద పోల్ టు పోల్ దూరం ఎక్కువగా ఉండటంతో ఇబ్బందులు తలెత్తగా, విద్యుత్ శాఖ ఏఈ ప్రవీణ్ పది కొత్త విద్యుత్ స్తంభాలను మంజూరు చేసి ఏర్పాటు చేయించారు. దీంతో బావులకు శాశ్వత విద్యుత్ సరఫరా అందుబాటులోకి వచ్చి రైతులకు ఉపశమనం కలిగింది. ఈ సందర్భంగా లైన్ ఇన్‌స్పెక్టర్ సంగమేశ్వర్, జేఎల్ఎం సంతోష్ కుమార్, ఆపరేటర్ నారాయణగౌడ్ సేవలను సర్పంచ్ చంద్రకళ, ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావుతో పాటు గ్రామ రైతులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## ఉపాధి హామీ కార్మికులకు చల్లని నీరు, నీడ సదుపాయం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 05, ప్రతినిధి: వట్పల్లి మండలం మేడికుంద గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కార్మికుల కోసం చల్లని తాగునీరు, నీడ సదుపాయాలు కల్పించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గ్రామ సర్పంచ్ యన్ చంద్రకళ ఆధ్వర్యంలో విశ్రాంతి సమయంలో కార్మికులు ఉపయోగించుకునేలా టాపర్ ఏర్పాటు చేసి తాగునీటి సదుపాయం కల్పించారు. ఈ ఏర్పాట్లపై కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తూ సర్పంచ్‌తో పాటు గ్రామ సెక్రటరీ, ఫీల్డ్ అసిస్టెంట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కాచూర్ రావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## SGTU ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులకు ఘన సన్మానం



సందేశం టైమ్స్, జహీరాబాద్, మే 05, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ జోన్‌లో SGTU శాఖ ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులకు ఘనంగా సన్మానం నిర్వహించారు. మొగుడంపల్లి వాస్తవ్యులు, సమాజ సేవలో ముందుండే నాయకుడు పట్లోల విజయ్ మోహన్ రెడ్డి భారతీయ జనతా పార్టీ తెలంగాణ స్టేట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా ఎన్నికైన సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. అలాగే SGTU క్యాలెండర్‌కు సహకరించిన మొగుడంపల్లి సర్పంచ్ రాజును కూడా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు సంఘ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ సంఘానికి సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో SGTU జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల కిష్టయ్య, జిల్లా కార్యదర్శి శివకుమార్, జహీరాబాద్, న్యాల్కల్ మండల గౌరవ అధ్యక్షులు డాక్టర్ శివశేఖర్, కిష్టయ్య, నాగరాజు, అధ్యక్షులు విశ్వనాథ్, కోశాధికారి రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులు విజయ్, మొగుడంపల్లి అధ్యక్షులు బానోత్ కిషన్, ఝరాసంఘం ప్రధాన కార్యదర్శి ఆర్ పాండు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో బీజేపీకి భారీ అవకాశం – అడికే జగదీశ్వర్ పటేల్



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 05, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తుందని పార్టీ నాయకుడు అడికే జగదీశ్వర్ పటేల్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అభివృద్ధి మరియు పారదర్శక పాలన కోసం బీజేపీ వైపు మొగ్గుచూపుతున్నారని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వానికి ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తోందని, మోదీ నాయకత్వం దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని, అదే నాయకత్వాన్ని రాష్ట్రాల్లో కూడా ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి వంటి రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ సాధించిన విజయాలు పార్టీ బలాన్ని చాటుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విజయాలు తెలంగాణలో కూడా పునరావృతం అవుతాయని, పార్టీ కార్యకర్తలు గ్రామ స్థాయిలో బలంగా పని చేస్తున్నారని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ స్పష్టమైన మెజారిటీ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు, రైతులకు మద్దతు వంటి అంశాలను ప్రధాన అజెండాగా తీసుకుని ముందుకు సాగుతామని జగదీశ్వర్ పటేల్ పేర్కొన్నారు. మొత్తంగా తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ వేగంగా ఎదుగుతోందని, ప్రజల ఆశలు, అభిలాషలను నెరవేర్చే దిశగా పార్టీ కృషి చేస్తోందని స్పష్టం చేశారు.


## అంతర్రాష్ట్ర వాహన దొంగల ముఠా అరెస్ట్ – రూ.2 లక్షలు, ఆయుధాలు స్వాధీనం





సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 05, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో అంతర్రాష్ట్ర వాహన దొంగల ముఠాను పోలీసులు విజయవంతంగా అరెస్ట్ చేశారు. నారాయణఖేడ్ పరిధిలో జరిగిన డీసీఎం వాహనం దొంగతనం కేసును ఛేదిస్తూ సీసీఎస్ మరియు నారాయణఖేడ్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాల ఆధారంగా దర్యాప్తు చేసి ఇద్దరు ప్రధాన నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అంతర్రాష్ట్ర స్థాయిలో వాహన దొంగతనాలు చేస్తున్న ముఠా గుట్టు రట్టయింది. నిందితుల వద్ద నుంచి రూ.2 లక్షల నగదు, ఒక పిస్టల్ (2 రౌండ్స్), ఒక ఎయిర్ గన్, రెండు కత్తులు, ఆరు సెల్‌ఫోన్లు, ఒక టిప్పర్ వాహనం స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 11 కేసుల్లో నిందితులు పాల్గొన్నట్లు ఒప్పుకోగా, మరికొంత మంది పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అరెస్టు చేసిన నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును సమర్థవంతంగా ఛేదించిన సీసీఎస్ సంగారెడ్డి బృందం, నారాయణఖేడ్ పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు.

## వేములనర్వలో బీరప్ప స్వామి కామరాతి కళ్యాణ మహోత్సవం ఘనంగా








సందేశం టైమ్స్, కేశంపేట్, మే 05, ప్రతినిధి: కేశంపేట్ మండలం వేములనర్వ గ్రామంలో శ్రీ బీరప్ప స్వామి కామరాతి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, సంప్రదాయ కార్యక్రమాల్లో భాగమయ్యారు. ఈ కార్యక్రమానికి బీజేపీ సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చేగు సుధాకర్, శ్యామ్ సుందర్ రెడ్డి, అత్తాపురం మహేందర్ రెడ్డి, మిద్దె గణేష్, కుడుముల బాల్ రాజ్, ప్రశాంత్ గౌడ్, అనేమోని కృష్ణ యాదవ్, పవన్ కుమార్ రెడ్డి, కుమార్ గుప్త, వేణు, చెవుల బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## జంతు బలిని అరికట్టాలని ప్రజావాణిలో ఫిర్యాదు


SREE DATTATREYA JEEVA KARUNYA SAMSTHA
శ్రీ దత్తాత్రేయ జీవ కారుణ్య సంస్థ
( Reg. No. 203/2014 )
Office : 1-3-42/1, Fathenagar, Medak - 502110.
website : www.sdjks.org.in, e-mail : sdjks2014@rediffmail.com

President
C. Shobha Rani
8247504649.

Date: 04-05-2026

1. C.SHOBHA RANI - 8247504649. President
3. B.BALESHAM. Secretary

సందేశం టైమ్స్, మెదక్, మే 05, ప్రతినిధి: కొల్చారం మండలం పోతన్ శెట్టిపల్లి గ్రామంలో నూతనంగా దుర్గామాత దేవత విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా ఈనెల 6న జంతు బలి జరగవద్దని కోరుతూ దత్తాత్రేయ జీవ కారుణ్యా సంస్థ సభ్యులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు జిల్లా అదనపు కలెక్టర్ నగేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వెంటనే స్పందించిన అదనపు కలెక్టర్ సంబంధిత జిల్లా పంచాయతీ అధికారి, రెవెన్యూ యంత్రాంగం, పోలీస్ శాఖ, మెదక్ డీఎస్పీకి జంతు బలి జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని శాంతియుతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ వేడుకలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు



సందేశం టైమ్స్, మెదక్, మే 05, ప్రతినిధి: టేక్మాల్ మండలం గ్లాస్పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రంగనపల్లి గ్రామంలో ఇట్టి కిష్టయ్య–పద్మ దంపతుల ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్, మెదక్ జిల్లా ఆర్టీఏ మెంబర్ మల్లారెడ్డి హాజరై రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జోగిపేట్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ కమిటీ చైర్మన్ షేక్ మజహర్, కోరంపల్లి సర్పంచ్ హనుమంతు, గ్రామ అధ్యక్షుడు మల్లేష్, ఉపసర్పంచ్ భూమయ్య, బేగరి రమేష్, తూర్పు భాగయ్య, రంగనపల్లి మల్లేష్, నిరుడు నర్సింలు తదితరులు పాల్గొన్నారు. ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరై ఇల్లు నిర్మించుకోవడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

## రైతు వారోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అల్లాదుర్గ్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొప్పుల శేషా రెడ్డి



సందేశం టైమ్స్, మెదక్, మే 05, ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా అల్లాదుర్గ్ రైతు వేదికలో రైతు వారోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అల్లాదుర్గ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల శేషా రెడ్డి హాజరై మాట్లాడుతూ రైతులు నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల ఎరువుల వినియోగం, నాణ్యమైన విత్తనాల వినియోగం వంటి అంశాలపై శాస్త్రీయ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. రైతులు పంట మార్పిడి చేయాలని, ఆయిల్ ఫామ్, పప్పు దినుసులు, జొన్నలు, మొక్కజొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని ఆయన తెలిపారు. అలాగే రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గారు అల్లాదుర్గ్ మండలానికి సామీకృత భవనం, నాలుగు లైన్ల రహదారి, ఎస్టీవో కార్యాలయం, ఫైర్ స్టేషన్ వంటి అభివృద్ధి పనులను మంజూరు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మల్లయ్య, ఏవో రాజేష్, ఎస్ఐ శంకర్, ఏఈఓ నవీన్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, మండల కాంగ్రెస్, కిసాన్ సెల్, యువజన కాంగ్రెస్ నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక గ్రీవెన్స్ డే – కలెక్టర్ ప్రతీక్ జైన్



సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్, 05: సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక నేతలు కలిసి దివ్యాంగుల సమస్యలపై వినతి పత్రం సమర్పించారు, జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింలు ఆధ్వర్యంలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు, సదుపాయాల లోపం, ప్రభుత్వ పథకాల అమలులో ఎదురవుతున్న ఇబ్బందులు వంటి అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు, జహీరాబాద్ ప్రాంత దివ్యాంగులు కూడా పాల్గొని తమ సమస్యలను వివరించారు, దీనిపై కలెక్టర్ ప్రతీక్ జైన్ సానుకూలంగా స్పందిస్తూ దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు, ప్రతి నెలలో ఒక శనివారం ప్రత్యేక గ్రీవెన్స్ డే నిర్వహించి దివ్యాంగుల సమస్యలను ప్రత్యక్షంగా వినిపించి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి దివ్యాంగుడికి చేరేలా అధికారులను సమన్వయం చేయాలని సూచించారు, ఈ నిర్ణయంపై దివ్యాంగుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## రైతులకు శాస్త్రీయ సాగుపై అవగాహన కార్యక్రమం అందోల్ మండలంలో సదస్సు



సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్, 05: అందోల్ మండలం రాంసాన్‌పల్లి గ్రామంలో గొర్రెకుంట పని ప్రదేశంలో రైతు కూలీలు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించబడింది, ఈ సందర్భంగా రైతులకు పంటల సాగు, ఎరువుల వినియోగం, పురుగు మందుల వాడకం వంటి అంశాలపై శాస్త్రీయ అవగాహన కల్పించారు, పంట మార్పిడి వల్ల కలిగే లాభాలు, అవసరమైన మేరకు మాత్రమే రసాయన ఎరువులు వినియోగించాల్సిన అవసరాన్ని శాస్త్రవేత్తలు వివరించారు, వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు డా.వి హేమలత, ఎ. నిర్మల, కె. అరుణ, పి. శ్రీరంజిత పాల్గొని రైతులకు సూచనలు అందించారు, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పండుగ హనుమంతు, తలారి శంకరయ్య, కుమ్మరి శివకుమార్, పట్నం దుర్గయ్య, పాల్వంచ రాజు, మన్నే కృష్ణయ్య, రైతు కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన అల్లాదుర్గ్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి



సందేశం టైమ్స్, మెదక్, మే 05, ప్రతినిధి: అల్లాదుర్గం మండలం గొల్లకుంట తాండా మాజీ సర్పంచ్ సోనీ శివరాం గారి సోదరుని కుమార్తె వివాహం బోడుమట్ పల్లి శ్రీరామ్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించబడింది. ఈ వివాహ వేడుకలకు ముఖ్య అతిథిగా అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బలరాం, డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకిషన్, ఉపాధ్యక్షుడు సాయిబాబా, సర్పంచ్ వీరన్న, మన్యనాయక్, ప్రభు, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బేతయ్య, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కురుమ మహేష్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు జైపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్, 05: మెదక్ జిల్లా కౌడిపల్లి రైతు వేదికలో ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న రైతు వారోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొని మాట్లాడుతూ రైతులు ఎక్కువ ఆదాయం వచ్చే ప్రత్యామ్నాయ పంటలైన కూరగాయలు, పూల మొక్కల సాగుపై దృష్టి సారించాలని సూచించారు, భూసార పరీక్షల విధానాన్ని అడిగి తెలుసుకుని శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయడం అత్యవసరమని తెలిపారు, హైదరాబాద్‌కు దగ్గరగా ఉన్న మెదక్ జిల్లాలో మార్కెట్ సౌలభ్యం ఎక్కువగా ఉండటంతో రైతులు కొత్త పంటల వైపు మొగ్గు చూపాలని పేర్కొన్నారు, రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రైతు వారోత్సవాలు–2026ను మే 04 నుంచి మే 09 వరకు జిల్లాలో అన్ని మండలాలు, గ్రామపంచాయతీలు, రైతు వేదికల స్థాయిలో విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు, వాతావరణ మార్పులు, ఉత్పత్తి వ్యయాల పెరుగుదల, మార్కెట్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని సూచించారు, ప్రతి గ్రామంలో ఒక్క రైతు కూడా మిగలకుండా అవగాహన కార్యక్రమాల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు, ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, స్థానిక వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా యాసంగి ధాన్యం కొనుగోలు చేపట్టాలి – మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి





సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్, 05: రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యాసంగి వరి ధాన్యం కొనుగోలు చేపట్టాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు, హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుండి మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి తదితరులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ కవర్లు, తాగునీరు, షామియానా, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటి అన్ని సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలని సూచించారు, తక్కువ సమయంలో కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు ధాన్యం కుప్పలను ఎత్తైన ప్రాంతాల్లో భద్రపరచాలని, వాతావరణ శాఖ హెచ్చరికలను రైతులకు వెంటనే చేరవేయాలని ఆదేశించారు, తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించి ఎలాంటి జాప్యం లేకుండా కొనుగోళ్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు, మే చివరి నాటికి 80 శాతం ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు, ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్ పాల్గొని జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు, చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## వడ్ల కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం – సీపీఎం ఆరోపణలు



సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్, 05: మెదక్ మండలం చిట్యాల, జనకంపల్లి గ్రామాల్లోని వడ్ల కొనుగోలు కేంద్రాలను సీపీఎం జిల్లా కమిటీ సందర్శించిన సందర్భంగా జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి కె. నర్సమ్మ ఆవేదన వ్యక్తం చేశారు, వడ్లు తూకం వేసిన తరువాత సంచులు కల్లల్లోనే నిల్వ ఉండటం, లారీలు రాకపోవడంతో కొనుగోలు చేసిన ధాన్యం తరలింపు జరగకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని ఆమె తెలిపారు, కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్‌లు, టెంట్లు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వడదెబ్బ మాత్రలు వంటి కనీస సౌకర్యాలు కూడా కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు, వడ్ల కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు, రైతులకు తక్షణమే అన్ని సౌకర్యాలు కల్పించి ధాన్యం తరలింపును వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె. మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు జె. సంతోష్, సీహెచ్ అజాయ్, మధు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.